# ఐకమత్యము

శ్రీమతి నాయని కృష్ణకుమారిగారు

‘ ఛీ, ఉప్పుగల్లుకు కూడా కారగావన్న’ సామెత వూరికే ఒచ్చిందా ? దీన్నిబట్టి తెలియడంలేదూ ? నీ వెంతో, నీ సామర్థ్యమెంతో ?” అన్నారు. అక్కమ్మగారి వంట యింటిమూలలోవున్న కూరగాయలతట్టలోని మిరపకాయలంగారు !

దాంతో ప్రక్కనవున్న చెక్కపెట్టెలో లవణస్వాములవారికి ములుగఱ్ఱతో పొడిచినట్లైంది.

“ఏం ? నీ ముందు నే నెందులో తీసిపోయాను ? నా మూలాన్న అన్ని వంట కాలకూ రుచిబస్తుంది.

‘లక్షాధికారైన లవణమన్నమెకాని
మెఱుగుబంగారంబు మ్రింగబోడు’

అన్నారుకాని ‘కారమన్నమెకాని’ అని అన్నారా ? అది ఒక్కటిచాలదూ నా సామర్థ్యాన్ని నిరూపించడానికి ?”

“చాల్లేవోయ్ నీ డంబాలు. నేనుమాత్రం ఏంతక్కువని ? నాలోమాత్రం విశిష్టతలేదూ ?

“మిరపగింజచూడ మీదనల్లగనుండు
కొరికిచూడ లోన చుఱుక్కుమనును
సజ్జనులగువారి సారమిట్లుండును”

అని సజ్జనులతో పోల్చారు పెద్దలు. అదీకాక కాస్తచుఱుకుగావుంటే ‘సీమ మిరపకాయరా’ అంటారుగాని నీ వూసైనాయెత్తరే ! ఏమంటావ్ ? ... అంతే గదోయ్ పులుసుభాయీ ?” అని ప్రక్కన కాగితంలోపెట్టిన చింతపండువైపుతిరిగింది మిరపకాయ.

ఆ ప్రశ్నతో నిద్రపోతున్న చింతపండు మహాశయుఁడు ఆవలిస్తూలేచి చేతులూ కాళ్ళూ సవరించుకొని "మీలో మీకెందుకు తగువులు? ఏం, కారంభాయీ!" అని వాటిరెంటినీ సర్దబోయారు గాంధీజీలాగ.

"అంతేలేండి. ఏంశాశ్వతం? అని సగంయిష్టం, సగం అయిష్టం సూచిస్తున్న ధ్వనితో పులుసుగారి వాక్యాలను సమర్థించబోయాడు నెహ్రూపండితుఁడిలాగ కారం మహాశయుఁడు.

కాని లవణస్వామి జయప్రకాశ్ నారాయణ్ ఉద్ధృతం పుణికిపుచ్చుకున్నాడామె. ఊరుకుంటాడా? "ఏం, ఆ కారం ముందు నన్నెందుకు కదిలించాలీ? అని ప్రొటెస్ట్ చేశాడు.

"పోనీ పెద్దలంటే చిన్నవాళ్ళూరుకోకూడ దబ్బాయ్?" అని సమర్థించాడు తింత్రిణీకుఁడు.

దాంతో చేదుమందుదాగిన 'పేషంట్' ముఖంపెట్టి ఒచ్చాడయ్యా, ఈ గాటికి మహామధ్యవర్తి, నేను చిన్నవాడినని చెప్పేందుకు. నేను మీకంటే ఏ విషయంలో చిన్నవాడినో వేలుపెట్టిచూపించండి? అట్టేమాట్లాడితే మీ యిద్దరూ నా కాలిగోరికిపోలరు. తెలిసిందా? అని 'ఛాలెంజ్' చేశాడు లవణస్వామి.

వెంటనే చింతపండుగారు నిప్పులుద్రొక్కినకోతే అయ్యారు. "ఏమిటీ? కారాన్ని చులకనచేసిందేకాకుండా నన్నూనా? మీ యిద్దరికంటె నాలోవున్న విశేషత ఏమోతెలుసా? నా రుచిని మనుష్యులు మీ యిరువురి సహాయం లేకుండా తెలుసుకో వచ్చు. అదే నిన్నయితే నీ కారాన్ని తగ్గించడానికి నేనేకావాలి. ఏం ఒప్పుకుంటారా? ఇప్పు డెవరుగొప్ప?

"నిన్నుమాత్రం అదేపనిగాతింటే ఏ మనిషైనా పళ్ళుపులిసిచస్తాడు." అన్నాడు మిరపకాయ మహాశయుఁడు నసుగుతూ.

"పళ్ళు పులవబట్టే మీ రుచులు తెలుసుకునే అవకాశంలేకుండా వాడునమల కుండా మింగుతాడు ప్రతిదీని. ఏం, యిప్పుడు తెలిసిందా నా మజా?" అన్నాడు కోపంతో తింత్రిణీకుఁడు.

"ఇకచాల్లేవోయ్ నీ డంబాలు." అని చప్పున అనేశాడు క్రోధంతో లవణ మహాశయుఁడు.

మిరపకాయగారు లవణమహాశయుఁడికి 'సపోర్టు'గా యేదోపలకబోయేంతలో వచ్చింది లక్ష్మమ్మగారు. దాంతో వీటినోళ్ళకు తాళాలు పడ్డయ్.

ఆ వచ్చిన లక్ష్మమ్మగారు మిరకాయలను పరపరాతరిగింది. వాటి అవస్థనుచూచి మిగతా రెంటిముఖాలూ జాలిపడ్తూన్నట్టు వెలవెలబోయాయ్. ఆ దయలేసి లక్ష్మమ్మ మిగతరెంటేసికూడాకలిపి కమ్మని 'సాంబారు' కాచింది.

ఆ యింటివారంతా ఆ సాంబారు కమ్మదనానికి మెచ్చుకున్నప్పుడు తెలిసింది, ఆ మూడింటికలయికవల్లే యీ కమ్మదనం వచ్చిందని.

'పులుసు,' 'ఉప్పు,' 'కారాలే'; 'హిందూ' 'ముస్లిం' 'సిఖ్ఖులై', 'లక్ష్మమ్మ'గారే 'గాంధీజీ'అయి, 'ఆ సాంబారే' వీరి సమైక్యతైతే, 'ఆకమ్మదనం' 'స్వరాజ్య' మెందుకు కాదూ? మీరేచెప్పండి!


# తలవెంట్రుకలను పెంచును



రీటా కుదుళ్లకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్.

తలవెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెంట్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండియే రీటా వాడుడు. రీటా హిందూదేశమంతటా దొరకును.

వెల సీసా 15 అణాలు.




**RITA**
**HAIR TONIC**